కథ

# ఎదురు చూసే నయనాలు

## అయ్యగారి శ్రీనివాసరావు

**''కలువకు చంద్రుడు ఎంతో దూరం. కమలానికి సూర్యుడు మరీ దూరం. దూరమైన కొలదీ పెరుగును అనురాగం...'' సన్నగా గాలిలో తేలుతూ వచ్చి చెవులకు సోకుతోంది పాట.**

**దేవుడు దొడ్డవాడు. ఎప్పుడేది ఎవరికెలా ఇవ్వాలో ఆ అంతర్యామికి తెలిసినంతగా మరెవరికీ తెలియదేమో! అందుకే అతడ్ని సర్వాంతర్యామి అన్నారు. లేకపోతే ఏంటి? ఏ పాతిక సంవత్సరాల క్రిందటో రిలీజైన సినిమాలోని పాటది. దాన్ని ఈ మోడర్న్ రోజుల్లో లౌడు స్పీకర్‌లో వెయ్యడమా!**



''దైవం మానుష రూపేణ'' అంటారు. తను అందరి దగ్గరకీ వెళ్ళలేక మానవ రూపంలో వస్తాడట సాయం చెయ్యడానికి. ''ఈ సమస్యకి పరిష్కారమేమిటా'' అని తల పట్టుకుంటున్న నాకు ''ఇదిగో ఇదేమైనా పనికొస్తుందేమో చూడు'' అని జ్యోతిరామ్‌ని నా దగ్గరకి పంపాడు. బ్రతిమాలుతున్నట్లున్న అతడి మాటలు ఒక చెవిలో పడుతున్న సమయం. అదే సమయంలో ఏ మనిషి మారుమూల హృదిలో సజీవంగా నిల్చివుందో ఈ పాట. అందరికీ మరొకసారి విన్పించాలనే సంకల్పం కల్గిందిలావుంది. కాదు, కాదు అది నా కోసం ఆ భగవానుడు చేసిన ఆధునిక గీతోపదేశం.

''ఇందులో బలవంతమేమీ లేదు. ఇలా చేస్తే నాకు సాయం చేసిన వాడివౌతావ్'' అన్న జ్యోతి రామ్ మాటతో ఈ లోకంలోకొచ్చాను. వాడలా అన్నాడే గాని, అతడి కళ్ళల్లో రిజల్ట్స్ చూసుకునే క్షణంలోని విద్యార్థి ఆతృత.

ఎందుకంటే....నా గత పరిస్థితులకేమీ తీసిపోని ఇబ్బందికర పరిస్థితులే అతడివీను. కాకపోతే ఇప్పటి నా పరిస్థితి కొంత నయం. నా భార్య చాలా తెలివైనది కావడంతో స్వశక్తితో సంపాదించిన ఉద్యోగం వుంది ఆమెకు కూడా. అందువల్ల నా ప్రస్తుత పరిస్థితులు కాస్త మెరుగనే చెప్పుకోవాలి.

కాని జ్యోతిరామ్ పరిస్థితి అది కాదు. పేదరికపు నేపథ్యం. దానికి తోడు అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన ఖర్చులు. దానికి పరిష్కారంగా అతడికి ఉద్యోగం రాకముందే అతడికీ, అతడి చెల్లెలికీ ఒకేసారి కుండమార్పు పెళ్ళిళ్ళు జరిగాయి. దాంతో బాట పక్కన మొక్కలా ఎదుగు బొదుగు లేని జీవితం అతడిది. మంచం పట్టిన తల్లి. డబ్బు లేదని మందిప్పించకుండా బలవంతంగా చంపుకోలేని పరిస్థితి. అలాగని బతికి ఉద్ధరించే ఆశ, అవకాశం లేదు. కుటుంబం కోసం చివరి చెమట చుక్క వరకు ధారపోసిన తండ్రి, ఎండిపోయిన శరీరంతో కళ్ళు కనబడక తప్పని పరిస్థితుల్లో మూలకు చేరాడు. కాకపోతే గుడ్డిలో మెల్లలా తన పని తాను చేసుకుంటాడు. జ్యోతిరామ్ దగ్గర లేకపోతే ఊపిరి కూడా ఆడక చచ్చిపోయే పరిస్థితి వాళ్ళది. అలాంటి పరిస్థితిలో దూరప్రదేశానికి జరిగిన ట్రాన్స్‌ఫర్. ఏం చెయ్యాలో తెలియని పరిస్థితి. అయితే ఒకరి శాపం మరొకరికి వరమైనట్టుంది అతడి ట్రాన్స్‌ఫర్ నాకు. ఎందుకంటే నేను ఇష్టం లేకపోయినా కొన్నాళ్ళు ఇంటినుండి దూరంగా వుండాలి. అదైనా ఏ నెలకో,రెణ్ణెల్లకో-తప్ప ఇంటికి రాలేనంత దూరంగా. దానికి నాకున్న కారణాలు నాకున్నాయి. అవి మళ్ళీ ఈ క్షణంలో ఆవిష్కృతమయ్యాయి నా మనసు తెర మీద.

★★★

''ఏమండీ!....'' గోముగా పిలిచింది సరళ. ఆ పిలుపులో ఏదో తేడా. ఏ పిలుపు ఎటువంటిదో క్షణంలో పసిగట్టేటట్టు చేసే జీవితానుభవం ఎక్కడికి పోతుంది మరి? అందుకే పలకలేదు నేను.

అవేవీ పట్టించుకోని సరళ మరింత దగ్గరగా వచ్చి మెల్లగా అంది. ''ఏవండీ! వసుంధరానగర్‌లో కొత్తగా అపార్ట్‌మెంట్లు కడుతున్నారట. డబుల్ బెడ్రూమ్‌వి, ట్రిబుల్ బెడ్‌రూమ్‌వి కూడా వున్నాయి. ఇంకా గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఖాళీలున్నాయట. ముందుగానే బుక్ చేసుకుంటే టెన్ పర్సెంట్ డిస్కౌంట్...'' చెబుతూ చెబుతూనే ఏ అనుమానమొచ్చిందో గాని ఆగిపోయి నా ముఖంలోకి చూసిందోసారి. వెంటనే తేరుకుని ''వింటున్నారా...?'' అంది. ఆ అడగడంలో కొద్ది చిరాకు. కానీ బయటపడని జాణతనం.

''వింటున్నాను.. చెప్పు...'' ముక్తసరిగా సమాధానమిచ్చాను.


''నేను చెప్పడమైపోయింది. మీ నిర్ణయం తెలియజేయడమే'' అదే ముక్తసరి.

''ఉద్యోగం మొన్న మొన్ననే రెగ్యులర్ అయింది. ఇప్పుడప్పుడే ఇల్లుకొనడం అవసరమా? కొన్నాళ్ళాగితే...'' ఆ చివరిమాట అన్నాక గుర్తొచ్చింది.''నా పుట్టింటి పరిస్థితులు చక్కబడ్డాక''అని నా వుద్దేశ్యమని ఆవిడ గ్రహించేసిందని. అప్పుడనిపించింది. ''అలా ఎందుకన్నానా?'' అని. ఎందుకంటే ఆమె సంగతి బాగా తెలిసిన వాణ్ని కాబట్టి.

''పిల్లల బాధ్యత పెరిగితే మరి కుదరదు. ఇప్పుడే జాగ్రత్త పడితే. పిల్లలు పెద్దయ్యే వేళకి అప్పు తీరిపోతుంది. నాకూ ఉద్యోగం వచ్చింది. మీకు జీతం పెరిగింది. ఇద్దరం కొద్ది కొద్దిగా మిగుల్చితే ఇల్లు మిగిలిపోతుంది'' అంది.

''కానీ....'' అని ఇంకేదో అనబోయి ఆగిపోయాను. ఆ మాటంటే ఆమె నుంచి ఎటువంటి స్పందన వస్తుందో నాకు తెలుసు కాబట్టి.

అక్కడే నాకు చాలా బాధనిపిస్తుంది. అన్ని విషయాలలోనూ ఒక ప్రణాళికబద్ధంగా, జీవితాన్ని గడుపుతూ మంచి స్థానానికెదిగింది. ఎవరికివ్వాల్సిన గౌరవం, ఎక్కడివ్వాల్సిన విలువ, ఆయా మోతాదుల్లో ఇస్తుంది. తన అత్త వారి తరుపు అనే సరికి వ్యతిరేకత చూపకపోయినా ఆర్థిక సహాయం విషయంలో వెనక్కే వుండి, నన్ను వెనక్కి లాగుతుంది.




ఆమె నా జీవితంలోకి ప్రవేశించకపోతే నా ఆర్థిక పరిస్థితి ఈనాడింత మెరుగ్గా వుండేది కాదనేది సత్యం. కాని ఏం ప్రయోజనం? ఆమెకు తెలిసినా నా కన్నవారింటివైపు ఆర్థిక సాయం చెయ్యని వ్వదు.ఆమెకు తెలిసిన విషయమే అయినా ఒకసారి గుర్తు చేసాను.

''నా చెల్లెలు పెళ్ళికుంది'' అని.

దానికామె''తెలుసు...'' అని సమాధానమిచ్చింది ముక్తసరిగా. అంతకుమించి ఆ తర్వాతి క్షణం నుంచి ఆ విషయమే తెలియని దానిలా ప్రవర్తించింది. మరోసారి నా తమ్ముడి చదువు ప్రసక్తి వస్తే. ''మీ తమ్ముడి చదువుకోసం మీరేం బెంగ పెట్టుకోనక్కరలేదు, దివ్యంగా సాగుతోంది''అంది వాడు స్కాలర్‌షిప్‌తో చదువుకుంటున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకుని. ఆ పై ఆ సంభాషణే మా మధ్య జరగనట్టు ప్రవర్తించింది. అది స్థితప్రజ్ఞతో, మంకుతనమో,పట్టుదలో,మొండితనమో,నాకింత వరకు అవగాహన కాలేదు.

ఇంత చేస్తున్నా ఆమెనేమీ అనలేకపోతున్నాను. అలాగని చాతకాని తనంతో కాదు. ఆమె క్రమశిక్షణ, ప్రణాళికా బద్ధమైన జీవన విధానంతో స్వయంశక్తితో ఎదిగినది కావడమే కారణం.

ఇంటర్మీడియట్ పాసై మరి చదివించే స్థోమత లేక ఆగిపోయిందామె చదువు. గంతకు తగ్గ బొంత లాంటి తనకు కట్టబెట్టాడామె తండ్రి.

ఎదగాలనే ఆతృత గల మొక్క, గోడ పగుళ్ళ మధ్య వుండిపోయిందిన్నాళ్ళూ. ఇప్పుడు స్థలం మార్చబడి సాదా నేల మీద కొచ్చింది. అది చాలు ఎదుగుదలకి. పెళ్ళయిన కొత్త మోజు. ఉద్యోగ ధర్మం వలన ఇద్దరి పుట్టింటోళ్ళకీ దూరంగా వేరింటి కాపురం. నేను ఉద్యోగానికి వెళ్ళిపోయాక ఏమి చేయాలో తెలియని ఖాళీ సమయం. వీటన్నింటిని చక్కగా వినియోగించుకుందామె. పెద్ద చదువులే చదివింది. కాకపోతే అల్లాటప్పాగా కాకుండా ఖచ్చితంగా ఉద్యోగం వస్తుందనే అవకాశం వున్న చదువే చదివింది. కుటుంబ పోషణే కష్టంగా వున్న నేను ఆమెను చదివించడానికి నానా యాతనపడవలసి వచ్చింది. ఒక రకంగా చెప్పాలంటే ఆమెను చదివించడం ఇష్టంలేదు నాకు. ఆమె ఎదిగిపోతుందని కాదు. ఆ డబ్బులుంటే మరో అవసరం ఒడ్డెక్కుతుందని ఆశ. కాని పొరబాట్న కూడా ఏనాడూ ఆ ఆలోచనల్ని ఆమె దగ్గర బయటపెట్టలేదు నేను. ఆ హుందాతనాన్ని నిలబెట్టుకున్న నేనంటే ఆమెకందుకే ప్రేమ కాని అంత హుందాగానే ఆ ప్రేమను నాపై చూపేది తప్ప ఏనాడు బహిర్గతంగా చూపలేదు. అంత లోతు గుండె మనిషామె.

కలలు సాకారమైన రోజున ఆమె కళ్ళలో కనిపించిన మెరుపు చూసే వాళ్ళు తట్టుకోలేని స్థాయిలో వుంది. ఆత్మవిశ్వాసం అందలమెక్కించింది. ఆమె అనుగ్రహం కోసం నలుగురూ ఎదురు చూసే

ఉద్యోగం. ఊహలు, పగటి కలలు దరిచేరనివ్వని వాస్తవ ఆలోచనలుకల మనిషామె. అలాటామె నాకు భార్యగా దొరకడం నిజంగా నా అదృష్టం.

కానీ...

భార్య ఒక్కతే నా సర్వస్వం కాదు కదా! అదే కర్తవ్యం అనుక్షణం కదలాడుతోంది మదిలో. అటు ఆ బాధల్ని విస్మరించలేను. ఇటు భార్యని ఒప్పించలేను. అందుకే జ్యోతిరామ్ బదిలీ రూపంలో వచ్చిన అవకాశాన్ని వినియోగించదల్చుకున్నాను. తనకు మారుగా ఎవర్నైనా చూపితే అతని బదిలీని రద్దు చేస్తామన్న అధికారులకి నా అంగీకారాన్ని తెలియజేసాను. ఇలా చేసినందుకు బాధగానే వున్నా తప్పదు. అలాగైతేనే చెల్లెలు పెళ్ళి చెయ్యగలను. ఆమెకు దూరంగా వెళ్ళిపోతే నా జీతం ఆమెకు లెక్కచెప్పినా అంతో, ఇంతో బాగానే వచ్చే రాబడి ఆ పై అప్పోసొప్పో చేసి చెల్లెలు పెళ్ళి చేసేస్తే ఇక నాకే బెంగ వుండదు. అందుకే బాధగా వున్నా బదిలీకి సిద్ధపడ్డాను.

★ ★ ★

''ఎన్నిసార్లు పిలిచినా పలకరేంటి? ఎందుకా పరధ్యానం?'' కాస్త చిరాకు ధ్వనిస్తూ పిలిచిన సరళ పిలుపుతో ఈ లోకంలోకొచ్చాను.

''జ్యోతిరామ్ వచ్చి ఈ కాగితాలిచ్చి వెళ్ళారు. ఆఫీసుకి అర్జంటుగా రమ్మన్నారు'' అంటూ రెండు జిరాక్స్ కాగితాలందించింది. వాటిని చదువుతూనే తుళ్ళిపడ్డాను. కారణం అది నా ట్రాన్స్‌ఫర్ కేన్సిలేషన్ ఆర్డరు.

''అయిపోయింది, అంతా అయిపోయింది. అనుకున్న అంచనాలన్నీ తల్లకిందులైపోయాయి. అయినా నా చెల్లెలుకి పెళ్ళి యోగం లేదు కాబోలు'' బాధగా దిగులుగా వున్న నన్ను చూసిన సరళ...

''ఏమైందండీ! ఎందుకలా వున్నారు? ఏంటా కాగితాలు?''అడిగింది. అలా అడిగిందే గాని ఆమె ముఖంలో ఇసుమంతైనా ఆందోళన లేదు. భర్త అంత ఆతృత పడుతుంటే ఏం జరిగిందోనని ఆందోళనపడడం భార్యకు సహజం. కాని ఈమెలో కనీసం చలనం లేదు. స్థిత ప్రజ్ఞత అంటే ఇదేనా...? అనిపించింది నాకు.

''మాట్లాడరేంటి?'' మరోసారి గుర్తు చెయ్యడంతో నోరు విప్పక తప్పలేదు నాకు. ''నా ట్రాన్స్‌ఫర్ కేన్సిల్ అయింది'' అన్నాను. 'విలువైన వస్తువేదో నేల జారిపోయింది' అని చెప్పే విధంగా వుంది నా మాట.

''అయితే... ఆనందించకుండా ఆ దిగులేంటి? ఏ సమయానికే ఎక్స్‌ప్రెషన్ ఇవ్వాలో తెలీదా?'' కాస్త వెక్కిరిస్తున్నట్లుగా భార్య మాట.

ఆమె అన్న మాట నిజమే కాని ''ఇది ఆనందించవలసిన విషయమా? బాధపడవలసిన విషయమా? ఎటు తేల్చుకోలేకపోతుంది నా మనసు. ఆనందిస్తే చెల్లెలు పెళ్ళి లేదు. ఆనందించకపోతే భార్య దగ్గర వెటకారం తప్పేట్టు లేదు. అందుకే మదిలో భావాలెన్నున్నా బయట పెట్టకుండా స్థిరంగా వుండిపోయాను.

అలా ఎంత సేపున్నానో తెలియదు.''ఈ ఫోటో చూడండి!'' అన్న భార్య మాటతో తేరుకుని అదందుకున్నాను.

''ఎవరీ అబ్బాయి?'' నోరు పెగుల్చుకుని అడిగాను.

''బాగున్నాడా? లేడా?'' నా ప్రశ్నకు జవాబుగా ప్రశ్నే వేసింది.

''ఫర్వా లేదు'' ఇదమిత్థంగా కాకుండా నిర్లిప్తంగా వుంది నా జవాబు.

''ఇతడు మా ఆఫీసులోనే సీనియర్ టెక్నీషియన్. నెలకు పది వేల వరకు జీతం. మనవాళ్ళే...'' అంటూ ఆగింది. అయినా నా ముఖంలోని భావాలలో మార్పు లేదని గ్రహించింది.

''మన దివ్యకి చేసుకుంటే బాగుంటుందంటారా?'' అంది నా చెల్లెలిని దృష్టిలో పెట్టుకుని.

''చేసుకుంటే బాగుంటుంది. కానీ చేసుకోవద్దూ!'' నా మాటల్లో వదలని నిరాశ ధ్వని.

''ఫోటో చూపించాను, నచ్చింది. చేసుకుంటానన్నాడు. మీకిష్టమైతే, రేపు మంచిరోజు, మాట్లాడడానికి వెళదాం'' అంది. ఆ మాటతో సెలైన్ ఎక్కించిన నీర్సప్రాణికి ఒక్కసారిగా సత్తువ వచ్చినట్లయింది. అంతలోనే పుట్టుకొచ్చిందొక కొత్త అనుమానం. అది గ్రహించిన సరళ ఇంక ఆగలేకపోయింది. అందుకే కాస్త గట్టిగానే అంది.

''ఈ క్షణమైనా నిండుగా నవ్వండి మహాశయా! మరిచిపోలేని సంఘటనల్ని విన్నా, చూసినా మనసు కొద్ది క్షణాలైనా స్పందించాలి. ఆమాత్రం అనుభూతులైనా అందుకోలేని స్థితిలో ఏమి లేము మనం. అయినా మన బాధలన్నీ తీరిన క్షణాలివి. ఎలా జరుగుతుందా? ఎలా చెయ్యాలా? అని బాధపడే మీ బాధలన్నీ నా మాటతో పరిష్కారమైపోలేదా?'' అంది. ఆ మాటతో ఆమెలో ఎంత బాధ ఇమిడి వుందో నాకర్థమౌతుంది. అయినా వేగంగా నడవాలన్నా నడవలేని నీటిలో నడక లాంటి స్థితి నాది. అందుకే అంత ఆనందకరమైన విషయం చెప్పినా ఆర్థికస్థితి గుర్తుకొస్తూనే వుంది. అదే అన్నాను తెగించి ఆమెతో.

ఆ మాటతో నా మీద చిరాకుని జాలిగా మార్చుకుంది. ఒక్క క్షణంలో నా దగ్గరకొచ్చి నా భుజమ్మీద చేతులేసి వాటి మీద తలవాల్చుతూ''ఏమండీ! ఈ క్షణాలు నాకివ్వండి. ఇన్నాళ్ళు మీ తమ్ముడి కోసం, మీ చెల్లెలి కోసం ఆలోచించారు. నా ప్రవర్తన వలన నాకు అత్తింటి వారి మీద అభిమానం లేదని అనుకున్నారు కదూ? కాదండీ! మీ వాళ్ళంటే నాకు అభిమానమేనండీ! అందుకే వాళ్ళ అవసరాలకి తగిన డబ్బు వాళ్ళకుంది. మనం పంపేది కూడా ఎప్పటికప్పుడు ఖర్చయిపోతుందని. అలా అయితే ఇవాళ అవసరం లాంటివి తీరవన్పించే వాళ్ళకీ డబ్బు పంపనివ్వలేదు. కానీ మీకు చెబితే ఆశ్చర్యపోతారు గాని, రేపు మీ చెల్లెలు దివ్య పెళ్ళికి కావలసిన డబ్బంతా నేను దాచాను. అదైనా మీ సంపాదనలోంచి, మీ వాళ్ళకు పంపకుండా దాచిందే. అంతే కాదు ఇప్పుడు వచ్చిన సంబంధం కూడా నా అండర్‌లో వున్న వాడు, మంచివాడు, బుద్ధిమంతుడు, దివ్యను మెచ్చాడు. ఆమెకు కూడా నచ్చుతాడని నమ్మకముంది'' అంది.

ఆ మాటతో నా నోటంట మాట రాలేదు. నా భుజం మీద వాలిన సరళని అలాగే హృదయానికి హత్తుకున్నాను.

★


కాకతీయ గడపలో కాలు పెట్టండి
మీ గుమ్మానికి కళ్యాణ తోరణం కట్టండి

కాకతీయ మ్యారేజెస్ ప్రై. లిమిటెడ్
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్చ్ వెనుక, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500 073.
ఫోన్ : 040-2374 7777, 09396 999 999



శ్రీమతి & శ్రీ చిరంజీవి యలమంచి

FREE online registration & Free search

AN ISO 9001:2000 ORGANISATION
www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com

| | | | |
|---|---|---|---|
| అమీర్‌పేట్ | 098481 55222 | చెన్నై (అన్నానగర్) | 093839 99999 |
| కూకట్‌పల్లి | 093913 11444 | (చెన్నై) టి. నగర్ | 093400 99993 |
| ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ | 099855 47475 | (చెన్నై) పోరూర్ | 093855 99077 |
| దిల్‌సుఖ్‌నగర్ | 098485 66733 | (చెన్నై) తాంబరం | 093400 99993 |
| విజయవాడ | 093922 92939 | బెంగుళూరు | 093429 39345 |
| గుంటూరు | 098485 35375 | జయానగర్ | 093429 39343 |
| తెనాలి | 098480 31931 | మైసూరు | 093429 39342 |
| విశాఖపట్నం | 098481 63833 | కోయంబత్తూరు | 093457 94668 |
| రాజమండ్రి | 098485 35377 | సేలం | 093855 99066 |
| కాకినాడ | 098483 37378 | మధురై | 093603 35233 |
| ఖమ్మం | 093470 59988 | వెల్లూర్ | 093449 94400 |
| ఒంగోలు | 098487 11223 | తిరుచి | 098428 01111 |
| నెల్లూరు | 098481 97222 | పాండిచ్చేరి | 098421 27777 |
| తిరుపతి | 098485 35378 | ఈరోడ్ | 093855 99011 |
| కర్నూల్ | 093900 33815 | అనంతపూర్ | 093460 09348 |

www.kaakateeya.com